సాక్షి కామారెడ్డి

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



మెరుగైన ఫలితాల కోసం..

ఈ విద్యాసంవత్సరంలో మెరుగైన ఫలితాల కోసం విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ సూచించారు.

- 8లో ▸



నాడు రాజన్న..

నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేశారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.7 /22.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి'



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో దోమకొండ ట్రస్ట్ సహకారంతో దేవునిపల్లి, బీబీపేట, భిక్కనూరు, లింగంపేట, రామారెడ్డి, నాగిరెడ్డిపేట, నస్రుల్లాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందించారు. రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, వైద్యులు పాల్గొన్నారు.

కంచుమల్ శివారులో చిరుత సంచారం



లింగంపేట : కంచుమల్ శివారులో చిరుతపులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. శనివారం రాత్రి గ్రామ శివారులో చిరుత రోడ్డు దాటుతుండగా ప్రయాణికుల కంటపడింది. వారు ఈ దృశ్యాన్ని తమ కెమెరాలో బంధించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు వెంటనే స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.


హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి పి.వెంకటేశ్, ఎస్టీ సంక్షేమాధికారి సతీష్‌యాదవ్ వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లాకు ఎస్సీ విద్యార్థులకు రెండు సీట్లు, ఎస్టీ విద్యార్థులకు ఆరు సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయాల్లో సంప్రదించి, దరఖాస్తులు సమర్పించాలని ఆయా సంక్షేమాధికారులు సూచించారు.

సండే స్పెషల్

ఈ... స్నేహం!

HAPPY FRIENDSHIP DAY





ఎలాంటి స్వార్థం లేనిది.. భేషజాలకు తావులేనిది స్నేహబంధం.. సుఖాలలోనే కాదు, కష్టాలలోనూ పాలుపంచుకునే పవిత్రబంధం అది. అందుకే 'స్నేహానికన్న మిన్న లోకాన లేదురా' అన్నాడో సినీ కవి. 'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం..' అంటూ ఫ్రెండ్‌షిప్ గురించి వివరించే ప్రయత్నం చేశాడు ఇంకో కవి.. 'వాడిపోనిది స్నేహమొక్కటే.. వీడిపోనిది నీడ ఒక్కటే.. హద్దంటూ లేనేలేనిది ఫ్రెండ్‌షిప్ ఒక్కటే.. కష్టమొచ్చినా నష్టమొచ్చినా మారిపోనిది ఫ్రెండు ఒక్కడే..' అంటూ స్నేహం గొప్పదనాన్ని మరో కవి వివరించాడు. ఆదివారం స్నేహితుల దినోత్సవం నేపథ్యంలో అలాంటి స్నేహితుల గురించి సండే స్పెషల్..

స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' స్నేహం గురించి సర్వే నిర్వహించింది. జిల్లాలో 50 మంది (25 మంది మహిళలు, 25 మంది పురుషులు) నుంచి నాలుగు అంశాలపై అభిప్రాయాలను సేకరించింది. ఆ వివరాలు..

✣ ఫ్రెండ్‌షిప్ అంటే..	
కల్మషం లేనిది	45
అవసరాలు తీర్చేది	05
✣ ఫ్రెండ్‌షిప్ కలుషితం అయ్యిందా...	
అవును	18
లేదు	32
✣ ఎంతమంది నిజమైన ఫ్రెండ్స్ ఉన్నారు	
ఒకరు	35
ఇద్దరికి మించి	15
✣ నీ ఫ్రెండ్‌కు ఇచ్చే స్థానం	
అమ్మ, నాన్న, ఫ్రెండ్	32
ఫ్రెండ్, అమ్మ, నాన్న	15
నాన్న, అమ్మ, ఫ్రెండ్	03

- కల్మషం లేనిది.. కన్నీళ్లు తుడిచేది స్నేహమొక్కటే
- నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే పరిచయాలు ఎందరినో స్నేహితులుగా మారుస్తాయి. చెడ్డీ తొడిగి గల్లీలో ఆడుకున్నప్పటి నుంచి స్కూల్‌కు వెళ్లి చదువు నేర్చుకున్న రోజులు, కాలేజీ చదువులు, ఉద్యోగాలు, ఉద్యమాలు, వ్యాపారాలు.. వివిధ స్థాయిల్లో కలిగే పరిచయాలతో ఎంతో మంది స్నేహితులు అవుతుంటారు. బంధువులు ఎందరున్నా బాధలు, ఆవేదన, సంతోషం స్నేహితులతోనే పంచుకోవడానికి ఇష్టపడుతుంటాం. వారి ఓదార్పు కొండంత బలాన్ని ఇస్తుంది. కొందరు స్నేహితులు జీవితకాలం తోడుంటారు. ఆపదలో మేమున్నామంటూ ముందుకొస్తారు. అయితే చదువుకునే రోజుల్లో దొరికే స్నేహితులు ఎప్పటికీ నిలుస్తారు. ఎందుకంటే ఎలాంటి వ్యాపార సంబంధాలు లేని స్నేహం అది. అందుకే అది కలకాలం నిలుస్తుంది. స్నేహితుడికి గానీ, వారి కుటుంబ సభ్యులకు గానీ ఏమైనా సమస్య ఎదురైందంటే చాలు ముందుగా వచ్చేది స్నేహితులే. మేమున్నామనే భరోసా ఇస్తారు. సమస్య నుంచి గట్టెక్కించే ప్రయత్నం చేస్తారు. ఏదేని పరిస్థితుల్లో స్నేహితుడు మరణిస్తే ఆ కుటుంబానికి అండగా నిలిచేది కూడా స్నేహితులే.

ఫ్యామిలీ ఫ్రెండ్స్..

ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునేవారు ఇంకా వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారు చాలా మంది రెగ్యులర్‌గా కలిసే స్నేహితులు కుటుంబ స్నేహితులుగా మారుతారు. మంచి చెడులకు హాజరవుతారు. కుటుంబాలతో కలిసి టూర్లకు వెళ్లడం, పిక్నిక్‌లకు వెళ్లడం ద్వారా ఆయా కుటుంబాల మధ్య స్నేహ సంబంధాలు పెంచుకుంటూ ఉంటారు. వారి మూలంగా వాళ్ల పిల్లలు కూడా స్నేహితులుగా మారుతుంటారు. స్నేహితులు, కుటుంబ స్నేహితులకు సంబంధించి రెగ్యులర్‌గా సంభాషించుకోవడానికి, భావాలు పంచుకోవడానికి సామాజిక మాధ్యమాలు వేదికగా మారాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు తమకు సంబంధించిన సమాచారాన్ని షేర్ చేసుకుంటున్నారు.

సేవా కార్యక్రమాలు..

పలువురు స్నేహితులు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవలి కాలంలో చిన్ననాటి స్నేహితులు ముఖ్యంగా టెన్త్‌లో కలిసి చదువుకున్న వారంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలతో ఒక్కచోటుకు చేరుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. స్నేహితులు ఎవరైనా చనిపోయినా, అనారోగ్యం పాలైనా అందరూ తలా కొంత జమ చేసుకుని వారికి సాయం అందించి ఆదుకుంటున్నారు. అలాగే తాము చదువుకున్న బడిలో సౌకర్యాల కల్పనకు కొంత సాయం అందించి చదువులమ్మ రుణం తీర్చుకుంటున్నారు.

స్నేహం వయసు ఆరు పదులు..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఊహ తెలియని వయసులోనే వారు స్నేహితులయ్యారు. బడిలో చేరినప్పుడు దోస్తులైనవారు.. తాతలుగా మారాకా తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఆరు పదులు దాటాకా నవ యువకుల్లా నవ సమాజం గురించి ఆలోచనలు చేస్తూ తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్లు కె.శ్యాంరావు, అయాచితం శ్రీధర్, రిటైర్డ్ హెచ్‌ఎంలు కె.వేణుగోపాల్, వీఆర్ శర్మ, ప్రముఖ న్యాయవాది జి.జగన్నాథం, రిటైర్డ్ ఆర్అండ్‌బీ ఉద్యోగి మధుసూదన్, జర్నలిస్టులుగా పనిచేసిన ఎ.దయానంద్, కె.రాములు, రిటైర్డ్ టీచర్లు మారుతి, కే.రమణ, డి.నారాయణ.. వీళ్లంతా చెడ్డీ దోస్తులు. ఉద్యోగాలు చేసి విరమణపొందారు. ఇందులో దయానంద్, రమణ ఇటీవల చనిపోయారు. విద్యార్థి దశలోనే వీరంతా సామాజిక స్పృహను ఒంటబట్టించుకుని సమాజం కోసం పనిచేయసాగారు. ఎవరు ఏ వృత్తిలో ఉన్నా సమాజాన్ని జాగృతం చేయడానికి ప్రయత్నించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు నాయకత్వం వహించారు. సిటిజెన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలోనూ గుర్తింపు పొందారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా కే.వేణుగోపాల్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. మాది మనీ సంబంధం కాదని, మానవీయత ఉన్న బంధమని పేర్కొన్నారు. ఎవరికి ఆపద వచ్చినా ఒకరికొకరం అండగా నిలుస్తున్నామన్నారు.



అరు దశాబ్దాలుగా కలసిఉంటున్న స్నేహితులు

44 ఏళ్లుగా దోస్తానా..



స్నేహితులు గంగారాం, రామారావు

మద్నూర్: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు సారంగ్లవార్ గంగారాం, రామారావుల మధ్య స్నేహం 1981లో చిగురించింది. ఇద్దరు కలిసే కళాశాల విద్యనభ్యసించారు. ఒకేసారి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఇద్దరం కలిసే ఎక్కడికైనా వెళ్తామని వారు చెబుతున్నారు. వాకింగ్‌కైనా, ఆలయాలకైనా కలిసే వెళ్తామంటున్నారు.

ఆరున్నర దశాబ్దాల చెలిమి..



బొల్లు నర్సింలు, అంకం కొండయ్య చిస్తి

లింగంపేట: మండల కేంద్రానికి చెందిన అంకం కొండయ్య చిస్తికి 80 ఏళ్లు. బొల్లు నర్సింలు వయసు 79 సంవత్సరాలు. కొండయ్య ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. బొల్లు నర్సింలు ప్రాథమిక స్థాయి విద్యాభ్యాసం చేసి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిది ఆరున్నర దశాబ్దాల చెలిమి. వీరి పొలాలు పక్కపక్కనే ఉండడంతో సెలవు రోజుల్లో వ్యవసాయ పనులకు వెళ్లి కలిసి పనులు చేసేవారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఇద్దరు కలిసి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. కొండయ్య చిస్తీ వెంకటఖాజా భక్తుడు, నర్సింలు అచల గురు భక్తుడు. వీరు ఇరువురు ఆశ్రమాలు ఒకేచోట నిర్మించుకున్నారు. ఏటా వెంకట ఖాజా ఆశ్రమంలో జెండా ఉత్సవాలు, అచలగురు ఆశ్రమంలో గురుపూజోత్సవం కలిసి నిర్వహిస్తారు. ఆశ్రమాల్లో ప్రతినెల భజనలు జరుగుతాయి. పండుగల సమయంలో అన్నదానం చేస్తారు.

స్నేహమనే మాటలో చెరో అక్షరం..



నయీం, మౌలానా

భిక్కనూరు : భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన నయీం, మౌలానా ఇద్దరూ స్నేహితులు. యాదృశ్చికంగా వారిద్దరు జన్మించింది 1952 సంవత్సరంలోనే.. వీరిద్దరు చిన్నప్పటినుంచే దోస్తులు. స్కూల్‌కు కలిసే వెళ్లేవారు. ఇద్దరూ ఏడో తరగతి దాకా చదువుకున్నారు. ఆ తర్వాత ఇద్దరు ఎలక్ట్రీషన్ పని నేర్చుకున్నారు. 1972 లో కలిసే ఉపాధి మస్కట్‌కు వెళ్లారు. అక్కడ బిలాబిన్ అనే కంపెనీలో పనిచేశారు. ఒకేచోట ఉన్నారు. సెలవులకోసం స్వదేశానికి సైతం ఇద్దరూ కలిసే వచ్చేవారు. తిరిగి మస్కట్‌కు కలిసే వెళ్లేవారు. 2016 లో ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి వచ్చారు. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పొద్దుపోయేవరకు నయిం, మౌలానా కలిసే ఉంటారు. ఒకే బైక్‌పై తిరుగుతారు. వారిని ఊరోళ్లంతా జోడీదార్ అని పిలుస్తుంటారు.

45 ఏళ్ల స్నేహబంధం..



సిద్ధి శ్రీధర్, వీటూరి రవి

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన సిద్ధి శ్రీధర్, వీటూరి రవి బాల్య స్నేహితులు. పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఉన్నత విద్యాభ్యాసం అనంతరం శ్రీధర్ వ్యాపార రంగంలో స్థిరపడగా.. రవి తన కులవృత్తి అయిన టైలరింగ్ చేస్తున్నాడు. తమ స్నేహం నాలుగున్నర దశాబ్దాలుగా ఎలాంటి పొరపొచ్చాలకు తావులేకుండా కొనసాగుతోందని వారు పేర్కొంటున్నారు.

లింబాద్రి గుట్ట మీదుగా టెంపుల్ కారిడార్

- ధర్మపురి నుంచి బాసర వరకు..
- జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

ఆర్మూర్ : జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి వేములవాడ, లింబాద్రి గుట్ట మీదుగా బాసర వరకు నాలుగు లేన్లతో టెంపుల్ కారిడార్ నిర్మాణానికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో ఈ కారిడార్ మంజూరవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్రను శనివారం నిర్వహించారు. ఆర్మూర్‌లోని ఆలూర్ రోడ్డులో మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించగా, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జనహిత పాదయాత్రను ప్రారంభించారు. పట్టణంలోని కాశీ హనుమాన్ మున్నూరు కాపు సంఘ భవనంలో రైతులు, లబ్ధిదారులతో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుల జిల్లా అయిన నిజామాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఉత్తర తెలంగాణలోనే మేటి జిల్లాగా తీర్చిదిద్దుతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. డి శ్రీనివాస్ రెండు పర్యాయాలు తాను మొదటి సారి ఈ జిల్లా నుంచే టీపీసీసీ స్థానాలకు ఎంపికయ్యామన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు ఇప్పించిన తమ ప్రభుత్వం త్వరలో వ్యవసాయ కళాశాలను సైతం ఏర్పాటు చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని సీ కన్వెన్షన్ హాల్‌లో బస చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పక్కన మీనాక్షి నటరాజన్

సీఎంతో మాట్లాడిన రైతులు..

ధరణి సమస్యలను పరిష్కరించాలని రైతులు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె రైతులను సీఎం రేవంత్ రెడ్డితో నేరుగా మాట్లాడించి భూభారతిలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి వెంట రాగా అక్కడి నుంచి గోల్ బంగ్లా, పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాద యాత్ర నిర్వహించారు. కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా మీదుగా పెర్కిట్ చౌరస్తా వరకు పాద యాత్ర కొనసాగింది. పెర్కిట్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వాడైనప్పటికీ బీసీ, దళిత, మైనారిటీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాడని కొనియాడారు.

'నిజాంసాగర్'లో ఎకో టూరిజం

- రూ. 9.98 కోట్లతో అభివృద్ధికి చర్యలు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద రూ. 9.98 కోట్లతో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ టూరిజం కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో టూరిజం కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వదేశ్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా నిజాంసాగర్ జలాశయం వద్ద ఎకో టూరిజం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ. 9.98 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎకో టూరిజం అభివృద్ధి కోసం జలాశయం వద్ద ఇప్పటికే 12 ఎకరాల 30 గుంటల భూమిని సేకరించామన్నారు. గుర్తించిన ఆ స్థలంలో వెంటనే భూమి చదును, పిచ్చి మొక్కల తొలగింపు పనులు పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా డీలక్స్ గదులు, స్పా, యోగా సెంటర్, రెస్టారెంట్, డార్మెటరీ, ముఖ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణం, థీమ్ గార్డెన్, చిన్న పిల్లల ఆట స్థలాల నిర్మాణాలకు శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డీఈ విద్యాసాగర్, ఏఈ సోహెల్, జిల్లా టూరిజం అధికారి జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు.



టూరిజం అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

కామారెడ్డి క్రైం: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. క్యాసంపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన వారికి తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయాలన్నారు. రోగులకు గడువు ముగిసిన మందులు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో అధికంగా ఉపయోగపడే జ్వరం, విరేచనాలు, దగ్గు, జలుబులాంటి వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయాలన్నారు. గ్రామాలలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, వైద్యులు జోహా ముజీబ్, మీనాక్షి దేవి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- సాధారణ ప్రసవాలు జరిగేలా చూస్తాం
- డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆస్పత్రులలో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ హెచ్చరించారు. గత నెల 31న 'సాక్షి'లో ప్రచురితమైన 'ప్రైవేటులో కోతలే' కథనంపై ఆయన స్పందించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, గైనకాలజిస్టులతో మూడు నెలలకోసారి సమావేశమై సమీక్షిస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేసి కాన్పుల విషయంలో తగిన సూచనలు ఇస్తామన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి దోపిడీ!

- ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ. 16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర



దారి దోపిడీ కేసులో నిందితులు, వారినుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులతో ఎస్పీ, పోలీసులు

కామారెడ్డి క్రైం : పగలు ఐస్ క్రీంలు అమ్ముతూ రెక్కీ నిర్వహిస్తూ రాత్రి సమయాల్లో దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.16 లక్షల సొత్తును రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మీడియాకు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూలై 25న రాత్రి సమయంలో భిక్కనూరు మండలం అంతంపల్లి శివారులో ఉన్న ఓ రెడీమిక్స్ ప్లాంట్‌లోకి దుండగులు చొరబడి ఇద్దరు వాచ్‌మన్‌లను బెదిరించి సెల్‌ఫోన్‌లు, సెంట్రింగ్ రాడ్‌లను దోచుకెళ్లారు. 27న రాజంపేట మండలం తలమడ్ల శివారులో ఉన్న ఓ ఫార్మా కంపనీలోకి రాత్రి సమయంలో చొరబడిన దుండగులు.. మందులు తయారు చేసే రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఆయా పీఎస్‌లలో కేసులు నమోదయ్యాయి. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో నిందితులను ఉత్తరప్రదేశ్‌కు చెందిన తానే అలీ, బిర్దేష్ అలీ, సల్మాన్, మహమ్మద్ సమీర్, చాంద్ బాబులుగా గుర్తించారు. వారు కొద్ది రోజులుగా కామారెడ్డిలోని ఆదర్శ్ నగర్, ఇందిరా నగర్ కాలనీల్లో నివాసం ఉంటూ ఐస్ క్రీం వ్యాపారం ముసుగులో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. శనివారం భిక్కనూరు టోల్‌గేట్ వద్ద ఒకరిని, కామారెడ్డిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఫార్మా కంపెనీకి చెందిన రూ.15 లక్షల విలువైన యంత్ర సామగ్రి, సెల్‌ఫోన్, సెంట్రింగ్ రాడ్లు, కాపర్ కేబుల్, 2 మోటార్లు, ఇతర సామగ్రిని రికవరీ చేశామన్నారు. నిందుతులు ఉపయోగించిన ఆటోలు, బైక్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెండు నేరాలతో పాటు నిందితులు కొద్ది రోజుల క్రితం మాచారెడ్డి మండలం పరిధిలో మరో నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు.

హైద్రాబాద్‌లో రిసీవర్..

ఐస్ క్రీంలు అమ్ముకునే ముసుగులో నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన హసన్ ఖాన్ అనే వ్యక్తి రిసీవర్‌గా పని చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని కూడా అరెస్ట్ చేశారు. నిందితులు పథకం ప్రకారమే దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతుంటారు. రెక్కీ సమయంలో అనువుగా ఉన్న ప్రదేశాలను ఎంచుకుంటారు. ఏ వస్తువును చోరీ చేసినా రవాణా చేయడానికి హసన్ ఖాన్ వాహనాన్ని సిద్ధం చేసి ఉంచేవాడని ఎస్పీ తెలిపారు. ముషీరాబాద్ చేరగానే పార్టులు విప్పేసి అమ్మేస్తారన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు సంపత్ కుమార్, రామన్, ఎస్సైలు శ్రీనివాస్, ఉస్మాన్, ఆంజనేయులు, అనిల్, ఏఎస్సై వెంకట్‌రావు, సిబ్బంది కిషన్, రాజవీరు, గణపతి, మైసయ్య, స్వామి, రాజేంద్ర కుమార్, రజనీకాంత్, కిషన్ గౌడ్, నరేష్, రవి, లక్ష్మీకాంత్, రాములును అభినందించారు.

క్లుప్తంగా

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



కామారెడ్డి అర్బన్: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు జన్మదినం సందర్భంగా శనివారం ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి అశోక్‌నగర్‌లోని మదన్‌మోహన్‌రావు నివాసంలో జేఏసీ నాయకులు కలిసి సన్మానించారు. జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ నాయకులు నాగరాజు, దేవరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంతో పాటు ఒడ్డేపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే. మల్లికార్జున్ చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. బంజపల్లి, సుల్తాన్ నగర్, ఒడ్డేపల్లి, అచ్చంపేట, వెల్గనూర్, మాగి గ్రామాలకు చెందిన 22 మందికి రూ. 14 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయని మండల అధ్యక్షుడు తెలిపారు. నాయకులు ప్రజా పండరి, రమేష్, రాము రాథోడ్ తదితరులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. పార్టీ అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, నాయకులు శ్యాంరావు, సుధాకర్‌రావు, సంజీవులు, నారాయణ రెడ్డి, గంగారెడ్డి, కార్యదర్శి పాల్గొన్నారు.

పాఠశాలకు డెస్క్‌లు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఆకుల మహేందర్ అనే పూర్వ విద్యార్థి తాను చదువుకున్న పాఠశాలకు డెస్క్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన మహేందర్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మహేందర్ మాట్లాడుతూ..త్వరలో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మిస్తానని పేర్కొన్నారు. విండో చైర్మన్ సదాశివరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, వీడీసీ చైర్మన్ సత్యం, సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశీయాత్రకు యూత్ సభ్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన అంజనీపుత్ర సిండికేట్ సభ్యులు శనివారం కాశీయాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మ చరిత్ర తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేవాలయాల చరిత్ర, సంస్కృతి, సనాతన ధర్మ విశిష్టతను తెలుసుకోవటానికి ఈ యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

స్నేహం పేరిట దోపిడీలు..

- సోషల్ మీడియా వేదికగా యాప్‌లతో వల
- నిర్మానుష్య ప్రాంతాలకు పిలిచి దాడులు, దోపిడీ
- ఐదుగురి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: స్నేహం పేరు మీద సోషల్ మీడియాలో నుంచి పలు యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, వాటిలో గ్రూప్‌లు తయారు చేసి సభ్యులను చేర్చడం, ఆపై అమాయకులను టార్గెట్ చేసి దాడులు, దోపిడీలకు పాల్పడటం వారి పని. కామారెడ్డితో పాటు చుట్టు పక్కల జిల్లాలలో నాలుగేళ్లుగా ఓ కొత్త రకం దోపిడీలను గుట్టుచప్పుడు కాకుండా చేస్తూ, లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్న ఓ ముఠాను కామారెడ్డి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. గత నెల 25న ఓ బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. సోషల్ మీడియా యాప్‌ల ద్వారా పరిచయమైన కొందరు వ్యక్తులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మెగా కార్ షెడ్డు వద్దకు తనను పిలిపించి తన ఫొటోలు తీసి, వాటిని అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడమే కాకుండా డబ్బులు ఇవ్వకుంటే వాటిని అందరికీ పంపిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశాడు. ఫోన్‌పే ద్వారా బలవంతంగా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ జోహెబ్, మహమ్మద్ మిరాజ్ పాషా, సయ్యద్ ముజాఫర్ అలీ, సిరిసిల్ల జిల్లా చంద్రంపేట్ గ్రామానికి చెందిన షేక్ సొహైల్ లతో పాటు ఓ మైనర్ లను నిందితులుగా గుర్తించారు. వారంతా గత నాలుగేళ్లుగా సోషల్ మీడియా యాప్‌ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, మేడ్చల్ ప్రాంతాల్లోని 41 ఘటనల్లో ఈ ముఠా దాడులు, వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. వసూళ్ల మొత్తం ఇప్పటికి రూ. 8 లక్షల వరకు నిర్ధారణ జరిగిందన్నారు. కాగా రూ. 40 లక్షలకు పైగా వసూలు చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితులపై కామారెడ్డిలో 6, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి పీఎస్ పరిధిలో 2, నిజామాబాద్‌లో ఒకటి చొప్పున మొత్తం 9 కేసులు నమోదైనట్లు ఎస్పీ వెల్లడించారు. ఇంకా చాలామంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు.

ఎవరైనా బాధితులు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ముఠా సభ్యులపై గతంలో కూడా కామారెడ్డి, సిరిసిల్ల, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో 11 కేసులు ఉన్నాయన్నారు. వాటిలో నిజామాబాద్‌లో ఓ యువకుడిని గతంలో ఇదే తరహాలో నమ్మించి హత్యకు పాల్పడిన కేసు కూడా ఉందని వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని అన్నారు.

సోషల్ మీడియా యాప్‌లతో పరిచయాలు..

నిందితులు సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుంటారు. యూత్, ట్రాన్స్‌జెండర్, లెస్బియన్స్, తదితర వాట్సప్ గ్రూప్ లను డౌన్‌లోడ్ చేసి వాటిలో చాలామందిని యాడ్ చేస్తూ గ్రూప్‌లుగా తయారు చేస్తారు. ముఖ్యంగా స్వలింగ సంపర్కులను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తుంది. పరిచయాలు పెంచుకుని అమయకులైన లెబ్బియన్ లను నిర్మానుష్య ప్రదేశాలకు పిలుస్తారు. రాగానే దాడులకు పాల్పడి ఉన్నదంతా దోచుకుంటారు. అంతే కాకుండా ఫొటోలు తీసి, డబ్బులు ఇవ్వాలనీ, లేకుంటే మార్ఫింగ్ చేసి అందరికీ షేర్ చేస్తామని బెదిరిస్తారు. నిందితుల్లో షేక్ సొహైల్ ఇదివరకు ఆర్మీలో పని చేసి వచ్చాడు. సోషల్ మీడియా పరిచయాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. కేసు ఛేదనలో కృషి చేసిన పట్టణ సీఐ నరహరి, సీసీఎస్ ఎస్సైలు శ్రీనివాస్, ఉస్మాన్, నరేష్, వినయ్ సాగర్, రాజారాం, బాల్ రెడ్డి, నరేష్, సిబ్బంది మైసయ్య, రవి, కమలాకర్, నరేష్, రాజు, భాస్కర్ లను అభినందించారు.

'నేరాల అదుపునకు పటిష్ట చర్యలు తీసుకోవాలి'



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

ఎల్లారెడ్డి: నేరాల అదుపునకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. శనివారం ఆయన ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ పోలీసింగ్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శించాలని, గ్రామ పరిస్థితులపై పూర్తి సమాచారం సేకరించాలని పేర్కొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. రాత్రి సమయాలలో మరింత పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. అనంతరం మాచాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సీఐ రాజారెడ్డి, ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం



రుద్రారంలో ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో పలుచోట్ల శనివారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఎల్లారెడ్డి మండలం రుద్రారంలో, పెద్దకొడప్‌గల్ మండలం కాస్లాబాద్‌లో, బాన్సువాడ మండలం బోర్లంలో ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ.. కల్తీ కల్లు నివారణకు గాను ఈత మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.

మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



విద్యాశాఖ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉండాలన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

బల్దియా అభివృద్ధికి కృషి చేయండి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ అభివృద్ధికి, వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా సానిటేషన్, తాగునీటి సమస్యల సమస్య రాకుండా నిరంతరంగా పర్యవేక్షించాలని కమిషనర్‌కు సూచించారు. కమిషనర్ రాజేందర్ రెడ్డి, టీపీవో గిరిధర్, ఆర్‌వో రవిగోపాల్, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయమైన పండగ రక్షాబంధన్



ఎల్లారెడ్డి: ఆత్మీయమైన పండగ రక్షాబంధన్ అని ఓంశాంతి దీదీ సౌమ్య అన్నారు. రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా ఓంశాంతి ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌లకు దీదీలు రాఖీలను కట్టారు. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడి ప్రియమైన పండుగ రక్షాబంధన్ అని అన్నారు. దీదీలు లలిత, కవిత, గంగలత తదితరులున్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం వీక్షణ

నస్రుల్లాబాద్: మిర్జాపూర్ రైతు వేదికలో శనివారం పీఎం కిసాన్ 20వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు మాట్లాడుతూ.. రైతుల ఖాతాల్లో అనుకున్న సమయానికి నగదు జమ చేసిన ఘనత పీఎం మోదీ పాలనలోనే సాధ్యం అన్నారు. అనంతరం బదిలీపై వచ్చిన ఏఈవో గ్రీష్మను సన్మానించారు. బీజేపీ నాయకులు సంతోష్, అనుసూరి శ్రీనివాస్, అరిగె నారాయణ, గొడిసెల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మాన్‌ధన్ యోజన.. రైతులకు భరోసా

మీకు తెలుసా?



కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పైబడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. మలిదశలో ఏ పని చేయలేని రైతులకు ఈ పథకం కొంత ఆసరాగా నిలుస్తుంది. 2019, సెప్టెంబర్‌లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు.

- ఈ పథకానికి గరిష్ఠంగా ఐదెకరాలలోపు సాగు భూమి ఉండి, 18–40 ఏళ్ల లోపు వయసున్న రైతులు అర్హులు.
- అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, ఇతర వృత్తి నిపుణులు ఈ పథకానికి అనర్హులు.
- రైతులు కామన్ సర్వీస్ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.
- రైతు ఫొటో, నివాస ధ్రువీకరణ పత్రం, వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆధార్ కార్డు తదితర పత్రాలు సమర్పించాలి.
- కేంద్ర పీఎంకేఎం పోర్టల్‌లో వివరాలు నమోదు చేశాక రైతుల మొబైల్‌కు సమాచారం అందుతుంది. ప్రత్యేకంగా పింఛన్ ఖాతాను తెరిచి కార్డు అందిస్తారు. వివరాలు నమోదు చేసినందుకు మీసేవా కేంద్రానికి రూ. 30 ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- ప్రతి నెలా సదరు కేంద్రంలోనే కిస్తీ చెల్లించవచ్చు నెల వారీగా లేదా 3,4,6 నెలలకోసారి కిస్తీలు చెల్లించవచ్చు.
- సకాలంలో చెల్లించకుంటే మరుసటి నెలలో అపరాధ రుసుముతో చెల్లించాలి. వయసు మేరకు ప్రీమియం ఉంటుంది.
- రైతులు 60 ఏళ్లు నిండే వరకు కిస్తీలు చెల్లించాలి. ఆ తర్వాత ప్రతి నెలా రూ. 3వేల చొప్పున పింఛన్ అందజేస్తారు.
- రైతు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛన్ అందజేస్తారు.
- పథకాన్ని కొనసాగించేందుకు కనీసం ఐదేళ్లపాటు తనవంతు వాటా ప్రీమియం నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

– సదాశివనగర్(ఎల్లారెడ్డి)

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. శనివారం తాడ్కోల్‌లో కొత్త రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క రేషన్ కార్డును పేదలకు ఇవ్వలేదని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పేదల బాధలు గుర్తించి కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్నారని, పేదల ఆకలి తీర్చే ఆయుధమే రేషన్ కార్డు అని అన్నారు. రేషన్‌కార్డులు ఇవ్వడంతో పాటు ఈ నెల నుంచే రేషన్ బియ్యం అందజేస్తున్నామని, అన్ని సంక్షేమ పథకాలను లబ్ధిపొందే అవకాశం దక్కిందన్నారు. రేషన్‌కార్డు లేని ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు అందుతుందని అన్నారు. నాయకులు గంగుల గంగారాం, మధుసూదన్‌రెడ్డి, హన్మాండ్లు, సాయిలు, అందే రమేష్, అంజయ్య, మేక రాంరెడ్డి, లక్ష్మాగౌడ్ ఉన్నారు.

'డీటీఎఫ్ పోరాటాల ఫలితమే ఉపాధ్యాయ ప్రమోషన్లు'



మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిలర్ విజయరామరాజు

కామారెడ్డి అర్బన్: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు, ఉపాధ్యాయులకు ప్రమోషన్ల షెడ్యూల్ ప్రకటన డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) చేసిన న్యాయ పోరాటాల ఫలితమేనని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీ ప్రభాకర్ అన్నారు. స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. 2004 నుంచి అమలు అవుతున్న కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి అందరికి ఓపీఎస్ అమలు చేయాలని, ప్రమోషన్లతో పాటు డిప్యూటీ డీఈవోలు, ఎంఈవో, జూనియర్ లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 30 డిమాండ్లతో 5న నిర్వహించే ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేతలు దేవులా, విజయరామరాజు, శ్యాంకుమార్, రాములు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

నాడు రాజన్న.. నేడు రేవంతన్న

- ప్రజల సంక్షేమమే వీరి ధ్యేయం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



భిక్కనూరులో రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

భిక్కనూరు: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా నాడు దివంగత సీఎం రాజన్న(వైఎస్సార్) నేడు రేవంతన్నా అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం భిక్కనూరులో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండేళ్లలోనే పగుళ్లు రావడం చూస్తుంటే ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎంత అవినీతి జరిగిందో అర్థం చేసుకోవాలన్నారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు అన్నీ కాంగ్రెస్ హయాంలోనే నిర్మితమయ్యాయని ఇప్పటికి అవి పగుళ్లు చూపలేదని గుర్తు చేశారు. రేషన్‌కార్డు 13 ఏళ్ల తర్వాత మంజూరు కావడం పట్ల సితార అనే లబ్ధిదారు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ ఎంపీపీలు బల్యాల రేఖ సుదర్శన్, తోగరి సుదర్శన్, జాంగారి గాలిరెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

కామారెడ్డి టౌన్: పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గోసంగి, ఇందిరానగర్ కాలనీ, హరిజనవాడలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అర్హులందరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి రూ. 7 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

వృద్ధులకు పింఛను కష్టాలు



దోమకొండలో వృద్ధురాలిని ఎత్తుకుని పింఛన్ పంపిణీ కేంద్రానికి తీసుకువచ్చిన బంధువులు

దోమకొండ: వృద్ధులకు పింఛన్ కష్టాలు తప్పడం లేదు. నూతనంగా తీసుకువచ్చిన ఫేస్ రికగ్నిషన్ విధానంతో వారి కష్టాలు మరింతగా పెరిగాయి. శనివారం దోమకొండ మండల కేంద్రంలో పింఛన్లు ఇవ్వడానికి చివరి తేదీగా అధికారులు నిర్ణయించారు. గతంలో వేలిముద్రలు రానివారికి గ్రామ పంచాయితీ కార్యదర్శి లేదా పంచాయతీ అధికారి వేలి ముద్రతో పింఛన్ ఇచ్చేవారు. కాని ప్రస్తుతం వచ్చిన ఫేస్ రికగ్నిషన్ వల్ల ప్రతి పింఛన్‌దారుడు కచ్చితంగా వచ్చి పింఛన్ తీసుకోవాలి. దీంతో ప్రతి ఒక్కరు తమ ఇంటిలో వృద్ధులను ఆటోలు, ఇతర వాహనాల్లో పింఛన్ పంపిణీ చేసే కేంద్రం వద్దకు తీసుకొచ్చారు. వృద్ధులను తమ చేతుల మీదుగా ఎత్తుకుని పింఛన్ కేంద్రాల్లోకి తీసుకొచ్చి డబ్బులు తీసుకున్నారు. అధికారులు పింఛన్‌ను బ్యాంకు ఖాతా ద్వారా అందించాలని, ప్రస్తుత విధానంతో తాము చాలా కష్టాలు పడుతున్నామని చాలా మంది వాపోతున్నారు.

ఐరిస్ పరిశీలన

భిక్కనూరు: మండల కేంద్రంలో పింఛన్‌దారుల ఐరిస్‌ను డీఆర్‌డీవో సురేందర్ శనివారం పరిశీలించారు. ప్రతి పింఛన్‌దారు తప్పనిసరిగా ఐరిస్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట డీపీఎం సాయిలు, ఏపీఎం సాయిలు, సీసీ శ్రీనివాస్, సబ్ పోస్ట్ మాస్టర్ శివాజీ ఉన్నారు.

వేర్వేరు చోట్ల జీవాలపై చిరుతల దాడి

- మహంతంలో దూడ, గడ్కోల్‌లో మేక మృతి



మహంతంలో మృతి చెందిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట/సిరికొండ: జిల్లాలోని నవీపేట, సిరికొండ మండలాల్లో చిరుతలు జీవాలపై దాడి చేసి చంపేశాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట మండలం మహంతం గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్‌కు నాలుగు గేదెలు, రెండు దూడలు ఉన్నాయి. మేత మేశాక ఎప్పటిలాగే గుట్ట కింద భాగంలోని రేకుల షెడ్డులో వీటిని కట్టేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి అందులోని దూడ చనిపోయి ఉంది. చిరుత దాడిగా అనుమానించి బాధితుడు ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలాన్ని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు జెహూర్, కుద్బుద్దీన్, బీట్ ఆఫీసర్ సుధీర్ పరిశీలించారు. మహంతం గుట్ట నుంచి వచ్చిన చిరుత దూడపై దాడి చేసినట్లుగా నిర్ధారించారు. వెటర్నరీ వైద్యుడు నరేందర్‌రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు.

గడ్కోల్‌లో..



మృతి చెందిన మేక

సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన మనోజ్ శనివారం తన మేకల మందను బొగ్గులకుంట అటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లాడు. పొదల్లో నుంచి వచ్చిన చిరుత, మేక మెడ భాగంలో దాడి చేసింది. అరుపులు విన్న కాపరులు గట్టిగా కేకలు వేయడంతో మేకను వదిలేసి చిరుత అడవిలోకి వెళ్లిపోయిందని తెలిపారు. గడ్కోల్ బీట్ ఆఫీసర్ దిలీప్ మేకను పరిశీలించారు. ఘటన స్థలంలో మొత్తం గడ్డి ఉండటంతో చిరుత అడుగులు కనబడలేనది ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరు మృతి



భాస్కర్‌రావు(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని మాధవపల్లి గ్రామానికి చెందిన నడిపోల్ల భాస్కర్‌రావు(30) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం రోజుల క్రితం గాంధారి–కామారెడ్డి రహదారిపై ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో భాస్కర్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. బాధితుడు కోమాలోకి వెళ్లడంతో అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఫుడ్ డెలివరీ బాయ్..



గడ్డం కృష్ణ(ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని బస్వాగార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో గాయపడిన యువకుడు శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ధర్పల్లి మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ(31) నగరంలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జూలై 31న రాత్రి 11 గంటలకు వేణుమాల్ నుంచి బస్వారెడ్డి గార్డెన్ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన కృష్ణను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నట్లు చెప్పారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

మాక్లూర్: వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలోని పుస్తెలతాడును అగంతకుడు లాక్కెళ్లిన ఘటన శనివారం మాక్లూర్ మండలం అమ్రాద్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాద్‌కు చెందిన మమ్మాయి శృతి మరో ముగ్గురు మహిళలు నిత్యం ఉదయం బీటీ రోడ్డుపై మాణిక్‌భండార్ వైపు వాకింగ్ చేస్తుంటారు. శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన నలుగురు మహిళల్లో మమ్మాయి శృతి మెడలో నుంచి ఒడ్డెట్‌పల్లి వైపు నుంచి బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి బంగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మోపాల్: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ న్యూడ్ ఫొటోలు, వీడియో ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిపై శనివారం పోక్సో కేసు నమోదైంది. 2019 ఏప్రిల్‌లో ఫేస్‌బుక్‌లో వీడియో, ఫొటోలు అప్‌లోడ్ చేయగా, నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ఆన్‌లైన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిజామాబాద్ నార్త్ సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

భర్త డెత్ సర్టిఫికెట్ కోసం సెక్రెటరీపై దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

మోపాల్: భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని తనకే ఇవ్వాలంటూ పంచాయతీ సెక్రెటరీపై దాడికి పాల్పడిన ఘటన శనివారం మోపాల్ మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాల ప్రకారం.. మంచిప్పకు చెందిన రిటైర్డ్ ఏఎస్సై షబ్బీర్ జూన్‌లో మృతి చెందాడు. ఆయన డెత్ సర్టిఫికెట్ కోసం రెండో భార్య పర్వీనా బేగం దరఖాస్తు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మొదటి భార్య రజియా సుల్తానా డెత్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌కు ఫోన్లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పర్వీనా బేగం సర్టిఫికెట్ తనకే ఇవ్వాలని సెక్రెటరీపై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ నెల 6వ తేదీన ఇరువురి సమక్షంలో డెత్ సర్టిఫికెట్ ఇస్తామని అధికారులు తెలిపారు. అయినప్పటికీ పర్వీనా బేగం తనకే ఇవ్వాలంటూ మండలపరిషత్ కార్యాలయంలో శ్యామ్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగి ఫోన్ లాక్కుంది. అంతటితో ఆగకుండా ఆయనపై దాడి చేసింది. ఎంపీవో సహా పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పర్వీనా బేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి సరికాదు..

మంచిప్ప పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్‌పై దాడిని ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ తీవ్రంగా ఖండించారు. విధినిర్వహణలో ఉన్న అధికారులపై దాడి చేయడం సరికాదని పేర్కొన్నారు.